ప్రజాశక్తి
బుధవారం 9 ఆగస్టు 2023
5
పార్వతీపురం మన్యం



ప్లాంటేషన్ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

భూ రీసర్వే పూర్తయిన భూముల్లో సరిహద్దు రాళ్లు వేసే (స్టోన్ ప్లాంటేషన్) పనులు వేగవంతం చేయాలని పాలకొండ సబ్ కలెక్టరు నూరల్ కమర్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని యు.వెంకంపేట పంచాయతీ సిఎస్ఆర్ పేటలో నిర్వహిస్తున్న స్టోన్ ప్లాంటేషన్ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారి సమక్షంలోనే సరిహద్దు రాళు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. రైతుల నుంచి ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట డిటి కుమారస్వామి, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

నెరవేరని తోటపల్లి లక్ష్యం



- 58,757 ఎకరాలకు అందని సాగునీరు
- పరిహారం, పునరావాసమూ అంతంతమాత్రమే
- నేడు ప్రాజెక్టును పరిశీలించనున్న టిడిపి అధినేత చంద్రబాబు



ఎంతో మంది రైతులు కలలుగన్న తోటపల్లి లక్ష్యం దాదాపు 20ఏళ్లు కావస్తున్నా నెరవేరలేదు. పాలకులు పరస్పర విమర్శలు చేసుకోవడం మినహా ప్రాజెక్టును పూర్తిచేయలేదు. ఫలితంగా లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అందడం లేదు. ముఖ్యంగా శివారు ఆయుకట్టుకు నీరు అందడం లేదు. గజపతినగరం బ్రాంచి కెనాల్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రాజక్టు కోసం పుట్టిపెరిగిన ఊళ్లు, తాతతండ్రుల నుంచి వచ్చిన పొలాలు త్యాగం చేసిన నిర్వాసితులకూ పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదు. ఇప్పటికీ చాలా మంది నిర్వాసితులు ప్రభుత్వ సాయం కోసం కాళ్లరిగేలా తిరుగుతునే ఉన్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తోటపల్లి ప్రాజెక్టు స్వాతంత్రానికి పూర్వం నుంచీ ఉంది. అప్పట్లో సుమారు 64 వేల ఎకరాల సాగునీటిని అందించేది. ఈ ఆయుకట్టును స్థిరీకరిస్తూనే పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2004లో సర్దార్ గౌతులచ్చన్న తోటపల్లి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో తమకు పునరావాసం, ప్యాకేజీ కల్పించిన తరువాతే నిర్మాణ పనులు చేపట్టాలంటూ సిపిఎం ఆధ్వర్యాన నిర్వాసితులు పోరాడిన విషయం విధితమే. ఈ క్రమంలో రైతులపై పోలీసుల లాఠీఛార్జి, విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతోపాటు రైతులను, సిపిఎం నాయకులను అక్రమ కేసుల్లో ఇరికించి జైలుకు కూడా పంపారు. ఇప్పటికీ ఆ సంఘటన ఈ ప్రాంతవాసులు కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. ఇటువంటి ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేయడం లోనూ, నిర్వాసితులకు న్యాయం చేయడంలోనూ పాలకులు విఫలమయ్యారు.

ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.891 కోట్లు ఖర్చు చేశారు. నిధులు సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల అంచనా వ్యయం ఏటా పెరిగిపోతోంది. వైసిపి అధికారంలో వచ్చాక సాగునీటి కేటాయింపులు పరిశీలిస్తే... అధికారిక లెక్కల ప్రకారం 2019-20 బడ్జెట్‌లో రూ.156 కోట్లు కేటాయించగా, ఆచరణలో రూ.13.64 కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. 2020-21లో రూ.225.57 కోట్ల కేటాయించగా రూ.37.27 కోట్లు చెల్లించింది. 2021-22లో 189.70 కోట్లకు గాను రూ.135 కోట్లే ఇచ్చింది. 2022-23లో రూ.126.61 కోట్లు కేటాయిస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. మరోవైపు సుమారు రూ.6.37 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు నిలిపేశారు.

ఇంకా పిల్లకాలువలు, మదుములు, స్ట్రక్చర్లు, లైనింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. 291.48 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. వీటన్నింటికీ ప్రాజెక్టు అధికారులు అంచనా వేసి ప్రతిపాదనలు పంపగా మార్చిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం రూ.80.84 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇందులో పెండింగ్ పనులకు రూ.73.13 కోట్లు, భూమి కొనుగోలుకు రూ.3.75 కోట్లు, ఆర్అండ్ఆర్‌కు రూ.3.96 కోట్లు విభజించారు. ఇప్పటికే నిధులు సరిపోక కాంట్రాక్టర్ పనులు నిలిపివేసిన పరిస్థితుల్లో కేటాయింపుల తగ్గింపు మరింత విస్మయానికి గురిచేసింది. పెండింగ్ పనుల వల్ల 58,757 ఎకరాలకు సాగునీరు అందడం లేదు.

నందివానివలస గ్రామస్తులకు ఇంకా పరిహారం చెల్లించలేదు. బాసంగి మిగులు భూములకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. బంటువానివలస, పిన్నింటి రామి నాయుడువలస వారికి పట్టాలు ఇచ్చినా, స్థలాలు చూపలేదు. కోటవానివలస గ్రామస్తులకు రోడ్డు సౌకర్యం కల్పించలేదు. పిఆర్ఎన్ వలసలో మౌలిక సదుపాయాలు లేవు. నిర్వాసిత గ్రామాల్లోని ఆలయాలకు నష్టపరిహారం, తమకు ప్యాకేజీలు కూడా ఇవ్వలేదంటూ కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నిర్మాణానికి అప్పట్లో మంజూరు చేసిన రూ.53వేలతో ఇళు నిర్మించుకో లేక పోయారు. ఈనేపథ్యంలో అర్అండ్ఆర్ కింద రూ.119.1 కోట్లు అవసరమౌతుందని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారు. ఇందులో కేవలం ఇళ్ల నిర్మాణం కోసమే రూ.106.8 కోట్లు అవసరం కానుంది. ఆర్అండ్ఆర్‌కు ప్రభుత్వం కేవలం రూ.3.96కోట్లు మాత్రమే కేటాయించింది. ఇప్పటికీ నిర్వాసిత కాలనీలు మొండిగోడల తోనూ, పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. ఇందుకు కనీసం రూ.5 లక్షలు ఇవ్వాలని నిర్వాసితులు చాలా కాలంగా కోరుతున్నారు. చట్ట ప్రకారం భూసేకరణ నాటికి తాత్కాలికంగా వలస వెళ్లిన వారికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని కూడా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం, నిర్వాసిత పోరాట కమిటీల ఆధ్వర్యాన నిర్వాసితులు మరో పోరాటానికి సిద్ధమౌతున్నారు.

తోటపల్లి ప్రాజెక్టుకు కేటాయించిన నిధులు

ఆర్థిక సంవత్సరం	కేటాయింపులు	విడుదల
2019-20	రూ.156 కోట్లు	రూ.13.64కోట్లు
2020-21	రూ.225.57కోట్లు	రూ.37.27కోట్లు
2021-22	రూ.199.70కోట్లు	రూ.1.35కోట్లు
2022-23	రూ.126.61కోట్లు	రూ.4.26
2023-24	రూ.80.84కోట్లు	రూ.????



పట్టణంలో ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

సేవ్ మణిపూర్

- హింసను ఆపాలి, మహిళలకు రక్షణ కల్పించాలి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన పట్టణంలో విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి - కలెక్టరేట్

మణిపూరులో శాంతిని నెలకొల్పాలని, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఆపేందుకు ప్రధానమంత్రి మోడీ పూనుకోవాలని, హింసను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి మెయిన్ రోడ్డు మీదుగా పాత బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగురోడ్ల జంక్షన్ వద్ద విద్యార్థులనుద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష్య కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ మాట్లాడుతూ 75 జాతీయ వసంతాల సందర్భంగా గత ఏడాది అమృత్సోవాలకు పిలుపునిచ్చిన మోడీ, 76 వ జాతీయ వసంతాల సందర్భంగా సేవ్ మణిపూర్ కార్యక్రమా లకు పిలుపునివ్వాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా మణిపూర్లో మైతీ, కుకి తెగల మధ్య మొదలైన హింసకాం డవల్ల 200 మంది హత్య చేయబడ్డారని, ప్రతి రోజు మహిళలపైన, విద్యార్థులపైన అత్యాచారాలు జరుగుతున్నా యని, అనేకమంది కుకి తెగకు సంబంధించిన గిరిజనుల ఇళ్లను తగలబెట్టారని, ఇంత విధ్వంసం జరుగుతున్నా ప్రధాని మోడీ కానీసంగా స్పందించకపోవడం చూస్తే మణిపూర్లో జరుగుతున్న హింసకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అండదండ లతో జరుగుతుందని వాపోయారు. తక్షణం మాణిపూర్లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. మహిళలను వివస్త్ర చేసి రోడ్లమీద బహిరంగంగా నడిపించి, అత్యాచారం అనంతరం హత్యచేసిన ఘటన దేశం తలదించుకునేలా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిగ్గుపడాలని, ఇలా బయటకు రాకుండా జరిగిన అనేక అఘాయిత్యాలకు మోడీ, మణిపూర్లో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. గిరిజనుల భూములను మైతే ప్రజలకు ఇవ్వాలనే సాకుతో విలువైన ఖనిజాలు కలిగిన కొండ ప్రాంతాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలనే కుట్ర దాగిఉందని, కాబట్టే కేంద్రం ప్రభుత్వం హింసాకాండను అరికట్టేందుకు ఏ ప్రయత్నమూ చేయలేదని, మానవత్వంలేని ప్రధానిగా మోడీ చరిత్రలో మిగిలిపోతారని విమర్శించారు. తక్షణం అల్లర్లకు పాల్పడే అరాచకశక్తులపై కఠినచర్యలు తీసుకుని మాణిపూర్లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. మేధావులు, ప్రజాస్వామికవాదులు, దేశ సమైక్యతను కోరుకునేవారు తక్షణం మోడీ ప్రభుత్వ మతోన్మాద చర్యలను ఖండించాలని, లేకపోతే మాణిపూర్ ప్రయోగం దేశవ్యాప్తంగా బీజేపీ, ఆరెస్సెస్ అమలుచేస్తుందని హెచ్చరించారు. నిరసన ర్యాలీలో ఎస్ఎఫ్ఐ నాయకులు సిహెచ్.సింహాచలం, కె.రాజు, ఎ.గంగారావు, చిన్నారి, కె.భాస్కర్, పి.వరుణ్, కె.ఉదయ్, హరి, ఎం.అన్నాజీ, ఉమా శంకర్, దిలీప్, పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మోడీ విధానాలను నిరసిస్తూ

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైకు ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, మహిళా, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం స్థానిక సుందరయ్య భవనం నుంచి పాతబస్టాండ్ వరకూ బైక్ ర్యాలీ జరిగింది. ప్రజాసంఘాల ఆధ్వర్యాన జరిగిన ఈ బైక్ ర్యాలీని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మోడీ అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 9న దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక ఐక్య సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మోడీ నాయకత్వంలో బిజెపిని ఓడించాలని ఈ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిజెపి అధికారం చేపట్టిన తర్వాత కార్పొరేట్లకు దాసోహమై దేశంలోని కార్మికులను, రైతులను తీవ్ర ఇబ్బందులు గురిచేస్తుందని విమర్శించారు. రైతులు పండించే పంటలపైన కార్పొరేటలకు పెత్తనం అప్పజెప్పి నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుదలకు బిజెపి కారణమైందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలైన స్టీల్ ప్లాంట్, రైల్వే, రక్షణ రంగం, ఇలా అన్ని రంగాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల ఫలాలు అందకుండా బిజెపి చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా బిజెపి తన విధానాలు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రమాదాన్ని గుర్తించి రాబోయే ఎన్నికలలో బిజెపి, దాని మిత్ర పక్షాలను ఓడించాలని పిలుపునిచ్చారు. మణిపూర్‌లో తెగల మధ్య మతచిచ్చు రేపి అక్కడి గిరిజన ప్రాంతంలో ఖనిజాలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయాలని, అందులో భాగంగానే మహిళలను నగ్నంగా ఊరేగించడంతో దేశ ప్రజలు తలదించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రెడ్డి వేణు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, పట్టణ సంక్షేమ సంఘం నాయకులు ఎస్ ఉమా, విఆర్ఎ సంఘం నాయకులు కష్ణ, సుదర్శన, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రాయిపల్లి రాము, కెవిపిఎస్ నాయకులు సింహాచలం, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మోడీ నాయకత్వంలో బిజెపిని ఓడించాలని మండల కేంద్రంలో మంగళవారం ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ మాట్లాడుతూ రైతులు పండించే పంటల పైన కార్పొరేట్లకు పెత్తనం అప్పజెప్పి నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుదలకు బిజెపి కారణమైందని విమర్శించారు. కార్మికుల హక్కులు హరించే చట్టాలను మార్చి కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకుండా బిజెపి చేస్తుందని విమర్శించారు. బిజెపి ప్రమాదాన్ని గుర్తించి రాబోయే ఎన్నికలలో బిజెపి. దాని మిత్ర పక్షాలను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దాసరి వెంకట నాయుడు, బాబురావు, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అడవితల్లికి పాలాభిషేకం

ప్రజాశక్తి - బెలగాం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా స్థానిక ఐటిడిఎ కార్యాలయం ఆవరణలో అడవితల్లి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. గిరిజన సంఘాల ఆధ్వర్యంలో అడవితల్లి విగ్రహానికి పాలాభిషేకం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక జూనియర్ కళాశాల దుర్గాదేవి గుడి వద్ద గిరిజన సంఘాల నాయకులు పిఒకు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ నుండి ఆయన్ను గిరిజన సాంప్రదాయ, వాయిద్య, నత్య ప్రదర్శన చేస్తూ ఐటిడిఎ కార్యాలయంలో అడవితల్లి విగ్రహం వరకు తీసుకువచ్చారు. గిరిజన సాంప్రదాయ పద్ధతి లో పూజలు నిర్వహించారు. అడవితల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు అధికారులతో పాటు గిరిజన సంఘాల నాయకులు మంచాల పారమ్మ, కోలక గౌరమ్మ, మువ్వల అమర్‌నాథ్ , బిడ్డిక తమ్మయ్య, పాలక రంజిత్ కుమార్, పల్ల సురేష్, దుక్క సీతారాం, నందివాడ కష్ణ బాబు, చెల్లూరి సీతారాం, ఆరిక చంద్రశేఖర్, జయసింహ, మణి కుమార్, గిరిజన విద్యార్థులు, యువత పాల్గొన్నారు.



అడివితల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఐటిఇఎ పిఒ, గిరిజనసంఘాల నాయకులు

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన

సీతంపేట : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సభలో సంఘం సీనియర్ నాయకులు బిడ్డిక అప్పారావు మాట్లాడుతూ జీవో 3కు చట్టబద్ధత కల్పించాలని, బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్పించొద్దని, 1/70చట్టం పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీసా చట్టం గ్రామ సభ జరిగేలా చేయాలన్నారు. మణిపూర్‌లో ఆదివాసీలకు జరుగుతున్న మరణ హోమాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. నాయకులు కొండగొర్రి భాస్కరరావు మాట్లాడుతూ నాన్‌షెడ్యూల్ గ్రామాలను ఐదో షెడ్యూల్లో చేర్చాలన్నారు. బిడ్డిక సాయి మాట్లాడుతూ అటవీహక్కుల చట్టం పటిష్టంగా అమలు చేసి గిరిజనులకు ఉపయోగపడేలా సవరణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సవర గంగయ్య, సవర శ్రీను, ఆరిక గంగాధర్, సవర ఆనందరావు, నాయకులు పాల్గొన్నారు.

10న అప్రెంటీస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి - సీతంపేట


స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 10న అప్రెంటిషిప్ రిక్రూట్మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు ఐటిఐ ప్రిన్సిపల్ ఎం.గోపాలకష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐలో ఉత్తీర్ణత పొంది ఫలితాల కోసం చూస్తున్న విద్యార్థులు హాజరు కావచ్చన్నారు. మేధా సర్వో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషన్ తదితరు కోర్సులకు అర్హులని తెలిపారు.

చిట్టిపూడివలస సమీపాన గజరాజుల గుంపు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టిపూడివలస సమీపాన మంగళవారం గజరాజుల గుంపు తిష్ట వేశాయి. ఇంత వరకు వంగర మండలంలోని తిష్ట వేసిన గజరాజుల గుంపు సోమవారం రాత్రి కిమ్మి మీదగా చిట్టిపూడివలస సమీపానికి చేరుకోవడంతో తీవ్ర భయాందోళనకు గురైనట్లు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గజరాజుల సంచారం వల్ల వరి దుబ్బులు నాశనమయ్యాయని రైతుల ఆందోళన చెందుతున్నారు. అలాగే ఎప్పుడు ఎవరిపైనా దాడికి దిగుతాయని, ఏం నాశనం చేస్తాయోనని బిక్కుబిక్కుమంటూ జీనం సాగిస్తున్నారు.





దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న శ్రామికమహిళా సంఘం నాయకులు ఇందిర; హాజరైన విఆర్ఎలు

ముగిసిన విఆర్ఎల నిరసన దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు 36 గంటలు స్థానిక కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారంతో ముగిశాయి. కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన డిఆర్ఒ వెంకట్రావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ నిరసన దీక్షలకు మద్దతు తెలిపిన కెవిపిఎస్, శ్రామిక మహిళా, సిఐటియు జనసేన నాయకులు వి.ఇందిర, ఎన్.సింహా చలం, బివి రమణ, వి.దాలినాయుడు, విఆర్ఎ సంఘం జిల్లా కార్యదర్శి జి.కృష్ణారావు మాట్లాడుతూ నేటికీ సమస్యలు పరిష్కారం కాలేదనీ, పే స్కేలు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, అర్హులైన విఆర్ఎలను వాచ్మెన్, కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలని, రికవరీ చేసిన డిఎని తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్ఎలుగా గుర్తించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని, గత కొన్నాళ్లుగా ప్రభుత్వానికి విన్నవిస్తున్నా కనీసం స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఆలోచించి విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రెడ్డి వేణు, జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, శ్రీను, సుదర్శన, విన్నారావు, రామయ్య, బాబురావు, వివిధ మండలాల విఆర్ఎలు పాల్గొన్నారు.

నేటి నుంచి 'నా నేల... నా దేశం' : ఎంపిడిఒ

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

నా నేల - నా దేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ జి.వెంకట రమణమూర్తి అన్నారు. మండలంలోని సచివాలయాల సందర్శన కార్యక్రమాలలో భాగంగా మంగళవారం ఎమ్మార్ నగరం, సంగంవలస సచివాలయాలను ఎపిఒ నాగలక్ష్మితో కలిసి సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఏడాది మాదిరిగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఈనెల 9 నుంచి 15 వరకు ఘనంగా నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా నరేగా నిధులతో శిలాఫలకాలను నిర్మించి పంచాయతీలకు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు వంగపండు త్రినాథ, బడే శ్రీరంజన్, కార్యదర్శులు లావణ్య భాస్కర్ రావు, ఉపాధిహామీ టిసి పాల్గొన్నారు.

వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని రావికోన పంచాయతీ నాలుగో వార్డు స్థానానికి ఈనెల 19న జరగబోయే ఉప ఎన్నికకు మంగళవారం సంగంవలస గ్రామ సచివాలయంలో ఎన్నికల అధికారి బసవరాజు, ఎంపిడిఒ జి వి రమణ మూర్తి కార్యదర్శి లావణ్యతో కలిసి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. నోటిఫికేషన్ విడుదలైన దృష్ట్యా వెంటనే నామినేషన్ స్వీకరణ జరుగుతుందన్నారు.

సీతానగరం : మండలంలోని జోగింపేట, లచ్చయ్యపేటలో ఖాళీగా ఉన్న వార్డు మెంబర్లకు ఎన్నికల నోటిఫికేషన్ ఎంపిడిఒ ఎంఎస్ఎల్ ప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. జోగంపేట రెండో వార్డుకు ఎన్నికల అధికారిగా ఇఒపిఆర్‌డి కెకె వర్మ, లచ్చయ్యపేట ఒకటో వార్డు ఎన్నికల అధికారిగా ఆర్డబ్ల్యూఎస్ జెఇ ఆర్.పవన్ కుమార్‌ను నిర్మించినట్లు తెలిపారు.

గరుగుబిల్లి : మండలంలోని గొట్టివలస, పెద్దగొడప గ్రామపంచాయతీల్లో ఒక్కొక్క వార్డు మెంబర్ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు గ్రామపంచాయతీ, వార్డు సభ్యుల ఎన్నికకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని ఎంపిడిఒ జి.పైడితల్లి, ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు తెలిపారు. గొట్టివలస గ్రామపంచాయతీ వార్డు మెంబర్ ఎన్నికకు సంబంధించి ఎన్నికల అధికారిగా ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ గోపి, గౌరీ శంకర్రావు పెద్దగొడపకు సంబంధించి ఎన్నికల అధికారిగా మండల ఇంజనీరింగ్ అధికారి మహమ్మద్ ఫరూక్ సైఫుద్దీన్‌ను నియమించామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు తిరుపతి భాస్కరరావు, అల్లు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే నిర్వహణకు అంతా సహకరించాలి

ప్రజాశక్తి - కురుపాం

ఓటర్ల సర్వే నిర్వహణకు రాజకీయ పార్టీ నాయకులంతా సహకరించాలని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నియోజకవర్గంలో గల వివిధ రాజకీయ పార్టీ నాయకులు మండల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఇంటింటికి ఓటర్ల సర్వే జరుగుతుందని, ఓట్లు చేర్పులు, మార్పులు అందరూ సహకరించి నూతన ఓటర్లు చేర్పునకు చనిపోయిన వారి తొలగింపునకు సక్రమంగా గుర్తించి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఐదు మండలాల తహశీల్దార్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్

పార్వతీపురం రూరల్ : ఓటరు నమోదుకు సహకరించాలని ఆర్‌డిఒ కె.హేమలత కోరారు. మంగళవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గంలో ఓటు అర్హత ఉన్న ప్రతీ ఒక్కరు వినతుగా నమోదు కావడానికి సహకరించాలని కోరారు. బిఎల్ఒలు సమర్పించిన దరఖాస్తులు అన్నింటికీ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని స్పష్టం చేశారు. సమావేశంలో తహశీల్దార్లు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి : సిపిఐ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

దేశ ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పనంగా అప్పజెప్పడాన్ని, మత విద్వేశాలు రెచ్చగొడుతూ ప్రజల మధ్య తగాదాలు సృష్టించే బీజేపీ విధానాలు నిరసిస్తూ "దేశాన్ని రక్షించండి" రాష్ట్రాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో తలపెట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్రకార్యవర్గసభ్యులు జి.ఈశ్వర్యయ్య కోరారు. ఈ మేరకు స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సేవ్ ఆంధ్రప్రదేశ్, సేవ్ ఇండియా నినాదంతో ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 8 వరకు సిపిఐ ఆధ్వర్యాన బస్సు యాత్ర చేపడుతున్నట్టు తెలిపారు. ఈ బస్సు యాత్ర సందర్భంగా పార్వతీపురంలో ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర నాయకులు పి.కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, సహాయ కార్యదర్శి టి.జీవ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసీ జీవితాల్లో వెలుగు రేఖలేవీ?

- పండగలతో ప్రభుత్వ ఆర్భాటం
- మౌలిక వసతులు లేక జీవనం దుర్భరం
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం/సీతంపేట

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లవుతున్నా మారుమూల గిరిజన పల్లెల్లో ఆదివాసీలకు నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్య హక్కులు, ఫలాలు అందని ద్రాక్షగానే ఉన్నాయి. 7 దశాబ్దాల కాలంలో ఎన్నో ప్రభుత్వాలు, ఎంతోమంది రాజకీయ నాయకులు, అధికారులు మారినా ఆదివాసీ గిరిజనుల జీవితాల్లో మాత్రం వెలుగురేఖ నిండలేదు. నాటికీ నేటికీ ఆదివాసీల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా అంతంత మాత్రంగానే ఉంది. ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో మాత్రం అభివృద్ధి శూన్యం. కళ్లలో కాంతి లేని ఆదివాసీ బిడ్డలకు నిజమైన పండుగ లేనట్టే. ప్రభుత్వం పండగల పేరుతో ఆర్భాటాలు మాని ఆదివాసీ గిరిజనుల హక్కులు, చట్టాలు పగడ్బందీగా అమలు చేసి వారి హృదయాల్లో చిరునవ్వులు పరిమళించిన నాడే నూటికి నూరు శాతం ఆదివాసీ పండుగ. ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

గిరిజన చట్టాలు చట్టుబండలే...

తరతరాల నుంచి అడవిని నమ్ముకుని బతుకుతున్న ఆదివాసీలకు ప్రభుత్వ పాలకుల విధానాలతో, కార్పొరేట్ శక్తులతో అడవిలో కూడ రక్షణ కరువైంది. ఆదివాసీల జాగృతికి ఎన్నో చట్టాలు అమలు చేసినా చట్టుబండలు గానే మిగిలిపోయాయి. అమాయకులైన ఆదివాసీల జీవితాల్లో వెలుగు నింపేందుకు ఆనాటి అల్లూరి సీతారామరాజు నుంచి మొన్న జరిగిన శ్రీకాకుళ రైతాంగ పోరాటం ఉద్యమం వరకు పోరాడి సాధించుకున్న గిరిజన హక్కులు, చట్టాలను నేటి పాలకులు స్వార్ధ రాజకీయాల కోసం నిర్వీర్యం చేస్తున్నారు. 1/70, అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం, ఎల్ టి ఆర్, ఉపాధి హామీ చట్టం పటిష్టంగా అమలు జరగడం లేదు. గిరిజన అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటిడిఎ పనితీరు అంతంత మాత్రమే. జిఒ 3 రద్దు, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను షెడ్యూల్ జాబితాలో చేర్చే ప్రక్రియ నేటి వరకు జరగలేదు.

గిట్టుబాటు ధర లేని అటవీ ఉత్పత్తులు

గిరిజనులు పండించే అటవీ ఉత్పత్తులకు దళారుల బెడద వెంటాడడంతో సరైన గిట్టుబాటు ధర లేక ఆర్థికంగా నష్టపోతున్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సీతంపేట మండలాల్లో ఎక్కువ శాతం చింత చెట్లు, జీడి తోటలు ఉన్నాయి. గిరిజనులకు ప్రధానమైన ఈ రెండు పంటలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేకపోవడంతో వచ్చిన పంటను తక్కువ ధరకే వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి.


ఏజెన్సీలో నిత్యం డోలి మోత కష్టాలు

సమస్యలతో సహజీవనం.....

పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పరిధిలో మారుమూల కొండల్లో ఆదివాసీలు వందలాది సమస్యలతో సహ జీవనం సాగిస్తున్నారు. నేటి వరకు గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. ఇక్కడ విద్య, వైద్యం, తాగునీరు వంటి కనీస మౌలిక సౌకర్యాలు నోచుకోని పరిస్థితి. అక్షరాస్యతకు దూరంగా అనారోగ్యంతో మరణాలకు దగ్గరగా జీవనం సాగిస్తున్నారు.


అభివృద్ధికి నోచుకోని ఆదివాసీలు

గిరిజన కళలు కనుమరుగు

ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో రోజు రోజు గిరిజన కళలు కనుమరుగవుతున్నాయి. గిరిజన గ్రామాల్లో సవర, జాతపు, కొండదొర, గదబ గిరిజన తెగలు జీవనం సాగిస్తున్నాయి. వారు నేటికీ సాంప్రదాయ కళలు, ఆచారాలు పాటిస్తున్నారు. డప్పు, తుడుము, సన్నాయి వాయిద్య కళాకారులు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ బాధ్యతతో పని చేస్తున్నారు. గిరిజన కళలు, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా గుమ్మలక్ష్మీపురంలో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్ల నుంచి కోరుతున్నా ఎటువంటి చర్యలు లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజన కళలపై దృష్టి సారించి అభివృద్ధికి కృషి చేయాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

చట్టాలు పగడ్బందీగా అమలు చేయాలి

భారత రాజ్యాంగం ఆదివాసీల కోసం రూపొందించిన చట్టాలు పగడ్బందీగా అమలు చేయాలి. గిరిజన హక్కులకు భంగం కలగకుండా చూడాలి. విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు న్యాయం జరిగేలా చూడాలి.

నిమ్మక నారాయణరావు,
మాజీ ఉపసర్పంచ్, కంబగూడ, సీతంపేట మండలం.

గిరిజన హక్కులకు రక్షణ కరువు

గుమ్మలక్ష్మీపురం : నేటి పాలకులు తమ స్వార్థ రాజకీయాల కోసం రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన హక్కులు, చట్టాలకు రక్షణ లేకుండా చేస్తున్నారని ఆదివాసీ హక్కుల వేదిక కన్వీనర్ అవినాష్ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో ఉన్న బిజెపి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ బాక్సైట్ తవ్వకాలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తూ గిరిజనులను అడవి నుంచి దూరం చేసే కుట్ర చేస్తుందని మండిపడ్డారు. తరాల నుంచి అడవినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న గిరిజనులకు అడవిపై పూర్తి హక్కు కల్పించేందుకు అటవీ హక్కుల చట్టం తీసుకొచ్చినా నేటికీ చాలామంది గిరిజనులకు పట్టాలు అందించలేదన్నారు. జిఒ 3 ను రద్దుచేసి ఉద్యోగ అవకాశాలు లేకుండా చేసిందని బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిందని విమర్శించారు. గిరిజనుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గిరిజన జీవన విధానంపై పాలకులు దాడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనులంతా మేల్కొని ఐక్య ఉద్యమాల ద్వారా హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం బుధవారం స్థానిక క్రీడా మైదానంలో జరుగుతుందని, ఈ ఉత్సవాలకు గిరిజనులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ఉత్సవాలకు సర్వం సిద్ధం

సాలూరు: ప్రపంచ ఆదివాసీ ఉత్సవాలకు రంగం సిద్ధమైంది. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివాసీ ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర కనుసన్నల్లో ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ పర్యవేక్షణలో ఏర్పాట్లు ఘనంగా చేశారు. సుమారు 6వేల గిరిజన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు వస్తారని అంచనా వేస్తున్నారు. ఆహూతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్న భోజనం, తాగునీటి సౌకర్యాలు కల్పించారు. మన్యం జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే గిరిజన కళాకారులు, నృత్యకారుల ప్రదర్శనలకు వేదిక సిద్ధం చేశారు. థింసా, ఇతర గిరిజన సాంప్రదాయ నృత్యాల ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. అరుకు,పాడేరు, కురుపాం, రంపచోడవరం, పాలకొండ నియోజకవర్గాల్లో ఆదివాసీ ఉత్సవాల నిర్వహణ కు ఏర్పాట్లు చేసుకున్నారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కాబట్టి మన్యం జిల్లా నలుమూలల నుంచి ఇక్కడికి గిరిజన సంఘాలు, ప్రజాప్రతినిధులు ఎక్కువగా హాజరయ్యే అవకాశం ఉంది.


బైకు ర్యాలీ చేస్తున్న భవననిర్మాణ కార్మికులు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సీతానగరం

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అందించాలని, అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు పింఛన్లు అందించాలని, ఇసుకను ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఎస్.కృష్ణ, జి.రమేష్, కమిటీ సభ్యులు ఎస్.శంకర్రావు, ఇ.వెంకటరమణ, సత్యనారాయణ, గోపి తదితరులు పాల్గొన్నారు.


ట్రెజరీశాఖ డిడి కుమార్‌ను సత్కరిస్తున్న సబ్‌ట్రెజరీ సిబ్బంది

సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని సందర్శించిన డిడి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని ట్రెజరీ శాఖ డిడి ఆర్ఎస్ఎ కుమార్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ట్రెజరీలో గల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డిడిని కురుపాం పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు, యుటిఎఫ్ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌టిఒ కె.శంకరరావు, సిబ్బంది సాయి, కుమార్, పెన్షనర్లు, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలను వెలిగించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ ప్రధాన రహదారి బంధం వారి వీధిలోను, రాయగడ రోడ్ నుండి బెలగాం శివారు వరకు డివైడర్ మధ్యలో ఉన్న సెంటర్ పోల్స్ విద్యుత్ దీపాలను వెలిగించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పాకల సన్యాసిరావు, సంచాల ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడుకు వినతిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు, బంధం వారి వీధి, పలు వార్డుల్లో ఉన్న వీధుల్లో విద్యుత్ స్తంభాల లైట్లు వెలగడం లేదన్నారు. దీనివల్ల చీకట్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నార,ని వాటిని వెలిగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కమిషనర్ స్పందించి సంబంధిత విభాగం ఏఈ సన్యాసిరావుకు సమాచారం ఇచ్చి రెండు రోజుల్లో సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.


హెల్త్‌సెంటర్ పనులను పరిశీలిస్తున్న డిఇ రత్నం, ఎఇ

హెల్త్ సెంటర్ పనులు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గెడ్డలుప్పిలోని హెల్త్ సెంటర్ పనులను మంగళవారం డిఇ ఎంఎం రత్నం పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను వేగవంతం చేయాలన్నారు. గ్రామంలో నిర్మాణమవుతున్న సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్ కేంద్రాల పనులు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. మండలంలో నిర్మాణ దశలో ఉన్న సచివాలయ భవనాలు వెంటనే పూర్తిచేసేలా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎఇ చంద్రమౌళి, సర్పంచ్ అల్లు తిరుపతినాయుడు, కాంట్రాక్టర్ రెడ్డి తవిటి నాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు

బదిలీపై వెళ్లిన అధ్యాపకులకు సన్మానం

ప్రజాశక్తి -సీతానగరం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన అధ్యాపకులు బి.రేణుక, టి.రవికుమార్, కిషోర్ కుమార్, వసంత్ కుమార్, అరుణ్ కుమారి. ఇంద్రకు మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డి వి ఎస్ ఎస్ త్రినాధ మాట్లాడుతూ సక్రమమైన పద్ధతిలో పాఠాలు బోధిస్తే విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. సక్రమమైన పద్ధతులను పాటించి బదిలీపై వెళ్లిన విద్యార్థి మనసులో స్థిరస్థాయిగా ఉండిపోతారని ఆయన అన్నారు. ఉద్యోగులకు బదిలీలు తప్పవని పనిచేసే దగ్గర గుర్తింపు వచ్చేలా పని చేస్తే ఎక్కడ కూడా ఆ గుర్తింపు ఉంటుందని ఆయన కొనియాడారు. అనంతరం వారిని సన్మానించి వీడ్కోలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎ.రామారావు, డి.రామకృష్ణ, ఆర్‌వి ప్రసాద్, ఎం.వినోద్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుమ్మలో 104 ఆధ్వర్యంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.ప్రజ్ఞ 92 మందికి వైద్య సేవలు అందించారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, డయేరియా బారినపడకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ భారతి, వైద్య సిబ్బంది భగవతి, ఆనంద్ పాల్గొన్నారు.


పేదలకు బట్టలు అందజేస్తున్న గౌరీశంకరరావు

పేదలకు బట్టలు పంపిణీ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో కీర్తిశేషులు పూసర్ల లక్ష్మి మూడో వర్ధంతి సందర్భంగా 50 మంది నిరుపేదలకు బట్టలు, నేతాజీ గ్రంథాలయానికి నాలుగు కుర్చీలను వితరణగా లక్ష్మి భర్త గౌరీశంకరరావు అందజేశారు. ఈ సందర్భంగా నేతాజీ గ్రంథాలయం స్థాపకులు ఈర్ల సంజీవ్ నాయుడు మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టిన గౌరీశంకరరావును అభినందించారు. కార్యక్రమంలో గౌరీశంకరరావు కుటుంబ సభ్యులు కోటేశ్వరరావు, మురళి, శ్రీను, ఈశ్వరమ్మ, బంగార్రాజు, వెంకటరాజు, హేమంత్, తాత బాబు పాల్గొన్నారు.

టీకా లక్ష్యం శత శాతం సాధించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

శత శాతం వ్యాక్సినేషన్ లక్ష్యంగా మిషన్ ఇంద్ర ధనుష్ టీకా కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు ఆయన పట్టణంలో ఒకటో వార్డులో మంగళ వారం వైద్య సిబ్బంది నిర్వహించిన మిషన్ ఇంద్ర ధనుష్ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. షెడ్యూల్ ప్రకారం గతంలో వ్యాధినిరోధక టీకాలు వేయించని పిల్లల జాబితా, అందుకు గల కారణాలు, ఏఏ టీకాలు ప్రస్తుతం వేస్తున్నారు తదితర అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. అలాగే గర్భిణీలకు టిడి వ్యాక్సిన్ అర్హులకు వెంటనే టీకా పూర్తి చేయాలన్నారు. ప్రతి బుధ, శనివారాల్లో నిర్వహిస్తున్న సార్వత్రిక టీకా కార్యక్రమంలో ప్రణాళిక ప్రకారం టీకా వేయబడిన ప్రతి పిల్లలకు మిషన్ ఇంద్ర ధనుష్‌లో పూర్తి స్థాయిలో టీకాలు వేయాలని డాక్టర్ జగన్నాథరావు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ప్రారంభమైన మొదటి దశ మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమం ఈ శనివారం వరకు కొనసాగుతుందని, తద్వారా శత శాతం లక్ష్యంగా పిల్లలకు, గర్భిణీలకు టీకాలు వేయాలని అన్నారు. తట్టు, రుబెల్లా తదితర వ్యాధులను పూర్తి స్థాయిలో నిర్మూలించ వచ్చున్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు మాట్లాడుతూ 350 సచివాలయాల పరిధిలో 478 టీకా కేంద్రాల్లో 384 మంది వ్యాక్సినేటర్స్(ఏఎన్ఎమ్) మొదటి దశ(7 నుండి 12 వరకు) మిషన్ ఇంద్ర ధనుష్ లో వ్యాధి నిరోధక టీకాలు నిర్వహిస్తున్నామని అన్నారు. టీకా వేసిన వివరాలన్నీ వైద్య ఆరోగ్య శాఖ వారు కొత్తగా చేర్చిన యూవిన్ పోర్టల్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు.కార్యక్రమంలో సూపర్ వైజర్స్ పుష్ప, జయగౌడ్, శ్రీధర్, ఎఎన్ఎం నాగమణి, అంగన్వాడి సిబ్బంది ప్రమీలారాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


టీకాలపై అవగాహన కల్పిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

మహాధర్నాను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -సాలూరు

ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రధాని మోడీని గద్దె దించేందుకు ఈనెల 9న నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు పట్టణ నాయకులు టి.శంకరరావు, టి.రాముడు కోరారు. మంగళవారం వారు మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల కొమ్ము కాస్తూ పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపుతున్నదని చెప్పారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ కు వ్యతిరేకంగా కార్మికులు 900రోజులుగా పోరాడుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం లో స్పందన లేదని చెప్పారు. ఇలాంటి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఈనెల 9న నిర్వహించనున్న మహాధర్నాను కార్మిక సంఘాలన్నీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కొమరాడ : క్విట్ ఇండియా సందర్భంగా మోడీ కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. కొమరాడ మండల కేంద్రంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్విట్ ఇండియా సందర్భంగా మోడీ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక ఐక్య సంఘటన ఆధ్వర్యంలో పార్వతీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసన కార్యక్రమాలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు


రోడ్డుపక్కనున్న పిచ్చిమొక్కలను తొలగిస్తున్న ఎస్ఐ షన్ముఖరావు

శభాష్ పోలీస్...

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వాహనదారుల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ఆర్అండ్‌బి శాఖ అధికారులు చేపట్టాల్సిన పనిని ఎల్విన్‌పేట పోలీసులు చేసి చూపించి శభాష్ అనిపించుకున్నారు. గుమ్మలక్ష్మీపురం నుండి కురుపాం వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ సమస్యను పలుమార్లు పత్రికల్లో ప్రస్తావించినా ఆర్అండ్‌బి అధికారులు కనీసం స్పందించలేదు. అసలు వారు విధులను ఎక్కడ నిర్వహిస్తున్నారో, ఎప్పుడు వస్తున్నారో ఎవరికి తెలియని పరిస్థితి. దీంతో సమస్యను గుర్తించిన ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు ప్రమాదకర మలుపులు ఉన్న పలుచోట్ల పెరిగిపోయిన పొదలు, చెట్లను తొలగించి జంగిల్ క్లియరెన్స్ చేయించారు. పోలీసుల సేవాభావం గుర్తించిన ప్రజలు, ప్రయాణికులు అభినందించారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి శాఖ అధికారులు మత్తు నిద్ర వీడి మేల్కోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గోతులను కప్పండి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో గల అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన భారీ గోతులను కప్పాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్తాం సమీపంలో గల రోడ్డుపై ఉన్న గోతుల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ ఇప్పటికైనా రోడ్లు భవనాలు శాఖ అధికారులు స్పందించి పార్వతీపురం నుండి కొమరాడ మీదుగా కూనేరు వరకు వెళ్లే అంతరాష్ట్ర రహదారి మార్గంలో ఉన్న పెద్ద పెద్ద గోతులను పూడ్చివేసి అటు వాహనదారులు ఇటు ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. అధికారులకు సమస్యపై ఫిర్యాదు చేసినప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని, శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈనెల 14 లోగా గోతులను పూడ్చాలని, లేకుంటే అక్కడే నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బత్తిలి శ్రీను, పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్త్రీనిధి రుణాలతో మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎపిఎం పి.అప్పలనాయుడు అన్నారు. స్థానిక వైకెపి కార్యాలయంలో సిబ్బందితో పాటు విఒఎలు, గ్రామైక్య సంఘాల అధ్యక్షులతో ఆర్థిక అక్షరాస్యతపై రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం మంగళవారం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో స్త్రీనిధి రుణాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మండలానికి సంబంధించి రూ.6కోట్లు మేర స్త్రీనిధి రుణాలు పంపిణీకి లక్ష్యంగా నిర్ణయించామని, ఈ లక్ష్యాన్ని అధిగమించేందుకు సిబ్బంది అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఇంతవరకు రూ.3కోట్లు పైబడి మహిళా సంఘాల సభ్యులకు రుణాలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ చందాన తిరుపతిరావు, మండల మహిళాసమైక్య అధ్యక్షులు గంట లక్ష్మి, సిసిలు కింజంగి కృష్ణ, వి.లక్ష్మణరావు, చింతాడ ప్రసాద్, బొంగు రామినాయుడు, ఆఫీస్ సిబ్బంది, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ కావాలంటే 2024 ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి గెలిపించాలని కురుపాం నియోజకవర్గం సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి కోరారు. మండలంలోని మారుమూల గ్రామమైన రెల్ల పంచాయతీ మల్లుగూడలో భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి పాలనలో ప్రజలకు కష్టాలే మిగిలాయని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొండలరావు, నాగేశ్వరరావు ఉన్నారు.

మందులు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల వ్యాధులకు మందులు అందుబాటులో ఉండాలని ఎంపిపి బి.రవణమ్మ సూచించారు. మంగళవారం ఆస్పత్రి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోగులకు సకాలంలో వైద్యం అందించాలని, అన్ని మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్, డిటి చిట్టెమ్మ, వైసిపి నాయకులు బి.శ్రీరాములు నాయుడు, ముకుంద, వైద్యాధికారులు కె.శిరీష, ఎం.ఉష పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు ఘన సన్మానం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకి-2 ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేసి ప్రజలు హృదయాల్లో మంచి స్థానం పొంది బదిలీ అయిన రెడ్డి పైడపునాయుడును ప్రధానోపాధ్యాయుడికి ఘన సన్మానం జరిగింది. ప్రస్తుత పాఠశాల హెచ్‌ఎం చుక్క తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పాపారావు పెద్దలు సత్యం నాయుడు, ఎంపిటిసి ప్రతినిధి శ్రీనివాసరావు, నేతాజీ గ్రంథాలయం స్థాపకులు ఈర్ల సంజీవ్‌నాయుడు, స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ గౌరీశ్వరి, మూడు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో కాలువలో పూడికతీతలు

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామాలకు పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా కాకపోవడంతో మంగళవారం కొట్టుగుమ్మడ, గడగమ్మ గ్రామానికి చెందిన అన్నదాతలు కాలువలోనే పూడికలు తొలగించారు. తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ మొదటి బ్రాంచి పరిధిలోనే నడిమికెల్ల, కడకల్ల, విక్రం పురం చిటిపూడి వలస, కిమ్మీ, కొట్టుగుమ్మడ, గడగమ్మ గ్రామాలకు సాగు నీరు సరఫరా కావాల్సి ఉంది. తమ గ్రామాలకు వచ్చేసరికి సాగునీరు అరకొరగా రావడంతో పంటలు సాగు చేయలేకపోతున్నారు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన రైతులు టిడిపి మండల అధ్యక్షులు ఉదయ భాస్కర్ ఆధ్వర్యాన కాలువలో పూడికలు తొలగించేందుకు పూనుకున్నారు.


శ్రమదానంతో కాలువలో పూడికలు తొలగిస్తున్న రైతులు


మహిళా రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపిపి పద్మావతి

చిరుధాన్యాలతో మహిళల ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - కురుపాం

మహిళా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి చిరుధాన్యాలు, కూరగాయలు ఎంతో లాభదాయకంగా ఉంటాయని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. మంగళవారం పిఎంజెవై పథకం కింద ప్రకృతి వ్యవసాయ సమన్వయకర్త అన్నపూర్ణ ఆధ్వర్యంలో చిరుధాన్యాలు, కూరగాయ విత్తనాలు పంపిణీ కార్యక్రమంలో ఎంపిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా రైతులు కూరగాయ విత్తనాలు, చిరుధాన్యాలు పెరట పంటల్లో వేసుకుని వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని కావున మహిళ రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 39 మంది మహిళా రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగ సిబ్బంది తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

టీచర్లను మనోవేదనకు గురిచేయడం తగదు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తీరువల్ల ఉపాధ్యాయులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఈ మేరకు ఆయన తీరు మార్చుకోవాలని పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాగాన విజయ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం పిఆర్‌టియు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఆర్‌సి బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిఆర్‌టి యు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరపు సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి కల్లూరి రవీంద్ర, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బొత్స రవికుమార్, మర్రాపు రామునాయుడు, వై రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పేరుకుపోయిన పూడిక

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని వెంగళరాయ సాగర్ జలాశయం పరిధిలో కాలువల్లో పూడిక తీయకపోవడం తో రైతులు అవస్థలు పడుతున్నారు. ఈనెల 4న జలాశయం నుంచి సాగునీటిని మంత్రి రాజన్నదొర విడుదల చేశారు. నాలుగు రోజులు గడుస్తున్నా 12ఎల్ కాలువ పరిధిలో సాగునీటి సరఫరా సక్రమగా లేకపోవడంతో కొండరాజేరు, కొత్తూరు గ్రామానికి చెందిన రైతులు పూడికతీత పనులు చేపడుతున్నారు. గత నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి ఎదురౌతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 50 మంది రైతులు మూడు కిలోమీటర్ల మేర పూడికను తొలగిం చుకోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.


కాలువలో పేరుకుపోయిన పూడికలు